# మొదటి సినిమా

# కె.బాలచందర్

***కె.బాలచందర్ తమిళనాడు దర్శకులలోనే కాదు భారతదేశ దర్శకులలోనే మకుటంగా నిలిచారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో ఎన్నో గొప్ప చిత్రాలకు దర్శకత్వం వహించారు. భారత ప్రభుత్వం వారిని 'పద్మశ్రీ' బిరుదంతో సత్కరించింది. వారి చిరస్మరణీయమైన తెలుగు చిత్రాలు - అంతులేని కథ, మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, ఇది కథకాదు, రుద్రవీణ, అందమైన అనుబవం, కోకిలమ్మ, ఆడవాళ్ళూ మీకు జోహార్లు, తొలికూడి కూసింది. వారి టెలివిజన్ నాటకాలు తమిళ, తెలుగు భాషల్లో సుప్రసిద్ధాలు. బాలచందర్ ప్రస్తుతం తన 81 ఏట అలుపెరగని యోధుడు. మళ్ళీ రంగస్థల ప్రవేశం చేసి 'ఒరు కూడై పాశం' (ఒక బుట్టెడు మమత) నాటకాన్ని తయారు చేసి మళ్ళీ సామాజికుల్ని అలరిస్తున్నారు. తన ప్రస్తానాన్ని అవిచ్ఛిన్నంగా సాగిస్తూనే ఉన్నారు.***

(సురభి పత్రిక కోసం గొల్లపూడి మారుతి రావుగారు, కె. బాలచందర్‌గారితో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ)



**నేను రచన చేసి, నటిస్తూ మిగతావారిచేత నటింపజేయాలనే సరదా నా జీవితంలో** 70 సంవత్సరాల పాతది. తిరువారూర్ నన్నీలం ప్రాంతంలో నల్లమాంగుడి అనే ప్రాంతంలో ఈ సరదా ప్రారంభమయింది. నల్లమాంగుడి ఇప్పుడు తంజావూరు జిల్లాలో ఉంది. ఇంటి అరుగు అప్పటి మా రంగస్థలం. ఆ రోజుల్లో విద్యుచ్ఛక్తి లేదు. కిరసనాయిలు కోసం ప్రతీ ఇంటికీ వెళ్ళేవాళ్ళం. అందరూ లేదనకుండా ఇచ్చేవాళ్ళు. రెండణాల అద్దెకి పెట్రోమాక్స్ దీపాన్ని తెచ్చి కిరసనాయిలు నింపేవాళ్ళం. శివరాత్రినాడు అందరూ జాగరణ ఉండే రాత్రి మా ప్రదర్శన. హాస్యంగానూ, చిలిపిగానూ ఉండే ఏదో కథ ఇతివృత్తం. అందరూ మెచ్చుకునేవారు. రెండు నెలలు రిహార్సల్స్. అప్పట్లో ప్రసిద్ధులయిన టి.కె.షణ్ముగం వంటి స్టేజి నటులు, ఎంతో ప్రాచుర్యంలో ఉన్న ఎమ్.ఆర్.రాధా వంటి సినీనటులు మాకు ఆదర్శాలు.

నా స్కూలు చదువు రోజుల్లో కూడా ఈ వ్యాసంగం సాగింది. స్కూలులో నాటకం వేయడానికి ఎలాంటి అవకాశం వచ్చినా నేను వదిలిపెట్టేవాడిని కాను. మా నాన్న గ్రామ మునసబు. ఈ నాటకాలు ఆయనకి నచ్చేవి కావు. నాటకాలు కూడు పెడతాయా అని నిలదేసేవారు. ఆయనంటే నాకు హడల్. చదవమని నిలదీసేవారు. ఆ రోజుల్లో నేను వేసిన చార్లెస్ డికెన్స్ పాత్ర - నోటర్ డామ్‌లో గూనివాడి పాత్రకి నాకు మొదటి బహుమతి వచ్చింది. ఇప్పటికీ ఆ జ్ఞాపకం, ఆనాటి ఫోటో నా దగ్గర ఉంది. ఆనాటి మా అనుభవాల గురించి 30 రోజులు విడవకుండా మాట్లాడమన్నా నేను రెడీ.

ఆ రోజు నేను నాటకం వేసున్నానని మా నాన్నకి ఎవరో చెప్పారు. నాటకం మధ్యలో నాన్న సరాసరి స్టేజి మీదకి వచ్చి నా చెవి పట్టుకుని తిట్ల వర్షం కురిపిస్తూ ఇంటికి లాక్కుపోయారు. ఇంటికి పోయాక బడితపూజ చేశారు.

కాలేజీ చదువుకి నన్ను చిదంబరం పంపారు. కాలేజీలో ఏటేటా ఏవేం ఉత్సవాలు జరుగుతాయో ముందు వాకబు చేశాను హాస్టల్ దినం, కాలేజీ స్థాపించిన దినం, చివరలో స్నాతకోత్సవం. బి ఎస్సీలో నాది బాటనీ, జువాలజీ గ్రూపు. చదువులో ముందుండేవాడిని. చదువుతో పాటు నాటక వ్యాసంగమూ సాగేది. నాటక రచన క్రమంగా పాకాన పడింది. ఆ రోజుల్లో ప్రముఖ వారపత్రిక 'ఆనందవికటన్' ఎస్.ఎస్.వాసన్ గారి సంపాదకత్వంలో వచ్చేది. అందులో హాస్యకథలు నా రచనలకు స్ఫూర్తి. మా అగ్రహానికి ఒకే ఒక పత్రిక వచ్చేది. నా దాకా ఆ పత్రిక రావడానికి ఎదురుచూసేవాడిని.

డిగ్రీ చేతికొచ్చాక, నాటకానుభవం ముదిరాక - ఉద్యోగం కోసం వెదుకులాట ప్రారంభించాను. ఆ రోజుల్లో శిక్షణ పొందిన టీచర్లకు కొరత ఉండేది. శిక్షణ లేని టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. నాకప్పుడు 19 ఏళ్ళు. సన్నగా పీలగా ఉండేవాడిని. గ్రామంలో 23, 24 ఏళ్ళ కుర్రాళ్ళు - నా కంటే ఎత్తరిగా ఉన్నవాళ్ళెందరో క్లాసులో ఉండేవారు. వాళ్ళకి నేనెలా చదువుచెపుతానా అని మా హెడ్మాస్టర్ సందేహం. నేను పాఠం చెపుతూంటే వరండాలో నిలబడి తొంగి చూసేవాడు.

కాలేజీలో 'నమూనా పార్లమెంటు' కార్యక్రమాలు జరిగేవి. నేను విడిచిపెట్టేవాడిని కాదు. మా సీనియర్లు ముఖ్యమంత్రి, ఇతర నాయకుల పాత్రల్లో ఇంగ్లీషులో ఉపన్యాసాలు దంచుతూంటే - నేను క్లాసులో కుర్రాళ్ళచేత అవన్నీ చేయించేవాడిని. మా హెడ్మాస్టర్ గారు ఆశ్చర్యపడినా తర్వాత నన్ను మెచ్చుకున్నారు. నన్ను ప్రోత్సహించేవారు తరువాత జరిగిన సంఘటన నా జీవితాన్నే పూర్తిగా మార్చివేసింది. మద్రాసు అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తా ఉద్యోగం వచ్చింది. ఆ విధంగా నాటకానికి మూలస్థానమైన మద్రాసుకి చేరాను.

ఆరోజుల్లో ట్రిప్లికేన్ ఫైన్ ఆర్ట్స్, అమెచ్యూర్ ఏక్టర్స్ గ్రూప్ వంటి సమాజాలు విరివిగా నాటకాలు వేసేవారు. కానీ ఆనాటి మద్రాసు సంయుక్త రాష్ట్రంలో ఉద్యోగ రీత్యా అటు శ్రీకాకుళం నుంచి నెల్లూరుదాకా ఉద్యోగం పనిమీద తిరగడం తప్పనిసరి కావడం వల్ల రెండు సంవత్సరాలు నాటక వ్యాసంగం వెనకపడింది. అప్పుడు పాత అకౌంటెంట్ జనరల్ బదిలీ అయివెళ్ళే వీడ్కోలు సభ, కొత్త అకౌంటెంట్ జనరల్ స్వాగత సభ కలిపి ఏర్పాటు చేశారు. నేను వెంటనే రెడీ. అన్నామలై మందిరంలో సభ. నాకు వచ్చిన గిమ్మిక్కులన్నీ కలిపి 'సినిమా పిచ్చోడు' అనే ఓ లకోటా ప్రదర్శన ఇచ్చాను. ముందు జీవితానికి ఇది ప్రారంభమా? కాదు. అప్పుడే కాదు. కొత్త ఏజీగారు నా నటన చూసి ముగ్ధులయారు. నాకు ఓ షీల్డ్ ఇచ్చారు.

అప్పటికి ఏజి ఆఫీసు తరపున నా సొంత నాటక సమాజాన్ని ఏర్పరుచుకున్నాను. నా నాటకాల ప్రదర్శనకు అది ప్రారంభం. నా మొట్టమొదటి నాటకం - మేజర్ చంద్రకాంత్. తరువాతి కాలంలో సినిమా ప్రపంచంలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. అది గంట నాటిక. అప్పుడు మళ్ళీ కొత్తగా వచ్చిన అకౌంటెంట్ జనరల్ స్వాగత సభలో ప్రదర్శించాం. ఆయన ఉత్తర దేశం వాడు. ఆ నాటికని ఇంగ్లీషులో రాశాను. నేనే మేజర్ పాత్ర వేశాను. అది 1964.

దరిమిలాను మేజర్ చంద్రకాంత్‌ని సుదీర్ఘమైన తమిళ నాటకాన్ని చేసి సామాజికుల ముందు ప్రదర్శించాం. ఎక్కడాలేని ప్రచారం మా నాటక సమాజానికీ, నాటకానికీ దగ్గింది. సుందర రాజన్ మేజర్ పాత్రని వేశారు. తదాది తన నాటక, సినీ రంగ చరిత్రలో సుందరరాజన్ మేజర్ సుందర రాజన్ గానే చలామణీ అయాడు. ఈ నాటకం చూసి - నాగేష్ అనే ఓ నటుడు మా సమాజంలో వేషంకోసం నా దగ్గరకి వచ్చాడు. ఎంత చిన్న వేషమయినా - ఇళ్ళల్లోకి పేపర్లు గిరాటేసే పేపర్ బోయ్ వేషమయినా వేస్తానన్నాడు. కానీ నేను అతన్ని ప్రధాన పాత్రధారిగా నాటకాల్ని తయారు చేశాను. అద్భుతంగా నటించేవాడు. మా ఇద్దరి జీవితం అలా ప్రారంభమయి - నాగేష్ ప్రధాన పాత్రధారిగా సర్వర్ సుందరం, నీర్ కుమిళి (నీటి బుడగ) మొదలైన నాటకాలతో చరిత్రను సృష్టించేదాకా సాగింది. నాగేష్ తన జీవితంలోనే ఒక చరిత్రగా మిగిలిపోయాడు.



ఆ తర్వాత మా సమాజం మెళుగు వత్తి (కొవ్వొత్తి), ఎదిరినీచ్చల్, నానల్, నవగ్రహం మొదలైన నాటకాలను ప్రదర్శించింది. అన్నీ పెద్ద హిట్స్.

నాకు సినీమాలంటే ఎక్కడలేని పిచ్చి. శివాజీగనేశన్, ఎం.జి.ఆర్ సినీమాలు, భీమ్ సింగ్, కృష్ణన్ పంజు దర్శకత్వం వహించిన సినిమాలు చూసేవాడిని. రాజ్‌కపూర్, శాంతారాం హిందీ చిత్రాలంటే ప్రానం. హిందీ సినిమా సంగీతం అంటే చెవికోసుకునేవాడిని.

ఆ రోజుల్లో పెద్ద పేరులేని ఎ.కె.వేలన్ అనే దర్శకుడు, ఓ తమిళ విద్వాంసుడు ఓ సినీమా తీశాడు. 'థాయ్ పిరందాళ్ వళి పిరక్కుం' (ఆషాఢమాసం వస్తే దారి అదే దొరుకుతుంది) సినిమా పేరు. అది పెద్ద హిట్ అయి అన్ని రికార్డులనీ బద్దలుకొట్టింది. ఆయన కొచ్చిపడిన డబ్బుతో అరుణాచల స్టూడియోస్ నిర్మించాడు. నిర్దుష్టమయిన నిర్ణయాలు తీసుకోగల వ్యక్తి. నా 'నీర్ కుమిళి' నాటకాన్ని చూశాడు. చాలా నచ్చింది. వెంటనే నన్ను పిలిచి ఆ నాటకం ఆధారంగా సినిమా తీయడానికి సిద్ధమయాడు. అంతేకాదు. దానికి నన్నే దర్శకత్వం చేయమన్నాడు. నా మీద పిడుగుపడ్డట్టయింది. అంతకుముందు ఎం.జి.ఆర్. నటించిన 'దైవథాయ్' (మాతృదేవత) అనే సినిమాకి మాటలు రాశాను. పేరున్న నటుడి సినిమాకి మాటలు రాయడం చాలా ఇబ్బంది అని తెలిసివచ్చింది. కనుక - నాకు దర్శకత్వం వహించే మనస్సులేదు. ఆ మాటే చెప్పి వచ్చేశాను. ఇది విని మా సమాజం నటులంతా బంగారంలాంటి అవకాశం వదులుకున్నందుకు చెడామడా తిట్టారు. అయినా సినిమాల్లోకి వెళ్ళడానికి నాకు మనస్సు రాలేదు. కానీ సహనటుల బలవంతం వల్ల సరేననకి తప్పలేదు. ఆవిధంగా బలవంతంగా నేను డైరెక్టరుగా సినిమాల్లోకి అడుగుపెట్టాను.

పెట్టానేగానీ ఒక పక్క ఏజీ ఆఫీసులో నౌఖరీ. మరోపక్క డైరెక్టర్ పని - నాకు ఇరకాటంగానే ఉంది. మా మామగారు ఆ రోజుల్లో నాతోనే ఉండేవారు. ఆయనకి ఈ కొత్తపని సుతారమూ నచ్చేది కాదు. తన కూతురుని - అంటే నా భార్యని - నాకు నచ్చచెప్పమనేవారు. అప్పటికే మా నాన్న కన్నుమూశారు. మా అమ్మకి ఇవేవీ తెలియవు. నీ మనస్సుకి ఏది మంచిదని తోస్తే అది చెయ్యి అనేది.

షావుకారు జానకితో ఓ ఆసక్తిరకమైన సంఘటన జరిగింది. నా నాటకాల రోజుల్లోనే ఆమె సినిమాల్లో పెద్ద స్టార్. 'మెళుగు వత్తి' నాటకంలో ఒక పాపులర్ స్టార్ వెయ్యాల్సిన వేషం ఉంది. జానకి చేత ఆ వేషం వేయించే స్తోమతు మా సమాజానికి లేదు. అడిగే ధైర్యమూ లేదు. అంతవరకూ ఏ నాటకాల్లోనూ ఆమె నటించలేదు. అయితే సుందరరాజన్ ధైర్యం చేసి ఆమెని కలిసి కథ చెప్పాడు. మేమంతా ఆశ్చర్యపోయేలాగా ఆమె వేషం వెయ్యడానికి అంగీకరించింది. అంతేకాదు. ఒక్కపైసా తీసుకోడానికి ఇష్టపడలేదు. ఆమె నటన ఆ నాటకంలో అద్భుతం. తరువాత 'నా 'ఎదిరినీచ్చల్' సినిమాలో 'పట్టుమామి' వేషంతో ఆమె తమిళ ప్రేక్షకులకు ఆరాధ్యదైవమయిపోయింది.

అరుణాచల స్టూడియోస్‌లో షూటింగ్ ప్రారంభమయింది. మొదటిరోజు అనుభవాన్ని నేనెన్నటికీ మరిచిపోను. నాగేష్ నేనూ అప్పటికి 'ఒరేయ్!' అని పిలుచుకునేవాళ్ళం. కానీ సెట్ మీద ఎప్పుడూ 'సార్!' అనేవాడు.

మొదటి చిత్రం పూర్తికాగానే - అందరి దర్శకులలాగే నా మనస్సులోనూ ఈ సినిమా ఏమవుతుందో రైళ్ళు పరిగెత్తాయి. తిరుపతికి పారిపోయి తిరుమలలో కూర్చున్నాను. 1964లో సెల్ ఫోన్లు లేవు. సినిమా ఎలావుందో తెలుసుకోడానికి మద్రాసుకి కాల్స్ చేస్తున్నాను. సినిమా బాగుందనీ, ఆడియన్స్ మెచ్చుకుంటున్నారని కబురు తెలిసింది. గుండెదిటవు పడి తిరిగి వచ్చాను. సినిమా 80 రోజులు ఆడింది. మంచి సమీక్షలు వచ్చాయి.

ఒక్క ప్రశంసని మాత్రం మరిచిపోలేను. ఏవియం చెట్టియార్ తన స్టూడియోలో సినిమా చూసి నాకో ఉత్తరాన్ని పంపారు. 'నువ్వు తమిళనాడు ఉత్తమ దర్శకులలో ఒకడివయావు' అంటూ. నా సినీ జీవితంలో నాకు దక్కిన మొదటి కితాబు అది. ఆ ఉత్తరం ఇప్పటికీ నా దగ్గర ఉంది.



## ఇంటర్వ్యూ: శ్రీ గొల్లపూడి మారుతి రావు

Click here to share your comments on this article